# శ్రీ ఆంజనేయ దండకమ్




సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/


# శ్రీ ఆంజనేయ దండకమ్

శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయం ప్రభాదివ్యకాయం ప్రకీర్తి
ప్రదాయం భజేవాయుపుత్రం భజేవాలగాత్రం
భజేహం పవిత్రం భజే సూర్యమిత్రం భజేరుద్రరూపం
భజే బ్రహ్మతేజంబటంచున్ ప్రభాతంబు సాయంత్రమున్
నీనామసంకీర్తనల్ జేసి నీరూపు వర్ణించి, నీమీదనున్ దండకం
బొక్కటిన్ జేయనూహించి, నీమూర్తినిన్ గాంచి,
నీ సుందరం బెంచి, నీదాసదాసుండనయ్
రామభక్తుండనై, నిన్ను నేగొల్చెదన్,
నీకటాక్షంబునన్ జూచితే, వేడుకల్ చేసితే!, నామొరాలించితే! నన్ను
రక్షించితే! అంజనేదేవి గర్భాన్వయా!
దేవా! నిన్నెంచ నేనంతవాడన్ దయాశాలివై జూచితే!,
దాతవై బ్రోచితే దగ్గరన్ నిల్చితే!
తొల్లి సుగ్రీవునకున్ మంత్రివై, స్వామికార్యంబు నందుడి, శ్రీరామ
సౌమిత్రులం జూచి, వారిన్విచారించి
సర్వేశు పూజించి, యబ్భానుజన్ బంటుగావించి
యవ్వాలిన్ జంపి; కాకుత్థ్స తిలకున్ దయా దృష్టి వీక్షించి,
కిష్కిందకేతెంచి శ్రీరామ కార్యార్థయై లంకకేతెంచియున్ లంకిణిన్
జంపియున్, లంకయున్ గాల్చియున్,
భూమిజన్ జూచి, యానందముప్పొంగ, నాయుంగరం బిచ్చి
యారత్నమున్ దెచ్చి శ్రీరాముకున్నిచ్చి సంతోషమున్ జేసి;
సుగ్రీవుడున్ అంగద జాంబవంతాది నీలాదులన్ గూడి,
యా సేతువున్ దాటి; వానరుల్ మూకలై దైత్యులన్ద్రుంచగా,
రావణుండంత కాలాగ్ని రుద్రుండుడై బోరి, బ్రహ్మాండమైనట్టి యా
శక్తియున్ వేసి యా లక్ష్మణున్ మూర్ఛనొందింపగా; నప్పుడేబోయి

సంజీవియున్ దెచ్చి, సౌమిత్రుకిన్నిచ్చి,
ప్రాణంబు రక్షింపగా; కుంభకర్ణాది వీరాళితోపోరాడి చండాడి,
శ్రీరామ బాణాగ్ని వారందరిన్ రావణున్ జంపగా; నంతలోకంబు
లానందమైయుండ, నవ్వేళలన్ యవ్విభీషణున్ వేడుకన్ దోడుకన్
వచ్చి, పట్టాభిషేకంబు జేయించి, సీతామహాదేవినిన్ దెచ్చి
శ్రీరాముతోజేర్చి,
నయోధ్యకున్ వచ్చి పట్టాభిషేకంబు సంరంభమైయున్న
నీకన్న నాకెవ్వరున్ కూర్మిలేరంచు మన్నించినన్
రామభక్తి ప్రశస్తంబుగా నిన్ను నీనామ సంకీర్తనల్ జేసితే పాపముల్
బాయవే, భయములున్ దీరనే భాగ్యముల్ గల్గనే, సకల
సామ్రాజ్యముల్ సకల సంపత్తులున్ గల్గవే వానరాకార! యో
భక్తమందార! యో పుణ్యసంచార! యో ధీర! యో శూర!, నీవే
సమస్తంబు; నీవే ఫలమ్ముగా వెలసి యా తారకబ్రహ్మ మంత్రంబు
పఠించుచున్ స్థిరముగా వజ్రదేహంబు నుందాల్చి శ్రీరామ శ్రీరామ
యంచున్ మనఃపూతమై ఎప్పుడున్ తప్పకన్ దలతు
నాజిహ్వయందుండి నీ దీర్ఘదేహమ్ము త్రైలోక్య సంచారివై
రామనామాంకితధ్యానివై, బ్రహ్మవై, తేజంబునన్ రౌద్రనిజ్వాల కల్లోల
హావీర హనుమంత ఓంకార, హ్రీంకార శబ్దంబులన్ భూతప్రేత
పిశాచంబులన్; గాలి దయ్యంబులన్ నీదు వాలంబునన్ జుట్టి
నేలంబడంగొట్టి; నీ ముష్టిఘాతంబులన్ బాహుదండంబులన్
రోమఖండంబులన్ద్రుంచి; కాలాగ్ని రుద్రుండవై, బ్రహ్మ
ప్రభాభాసితంబైన నీ దివ్య తేజంబునుంజూచి; రా! రా! నా ముద్దు
నరసింహ యంచున్, దయాదృష్టి వీక్షించి నన్నేలు నా
స్వామి!...నమస్తే సదా బ్రహ్మచారీ! నమస్తే వాయుపుత్రా; నమస్తే,
నమస్తే, నమస్తే, నమస్తే, నమస్తే నమః

-=-=-

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్





Kiron Type Institute